క్లుప్తంగా

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ తరఫున పాల్గొన్న గుంటూరు గ్రూప్ కేడెట్లను కమాండర్ కల్నల్ ఆర్. జయకుమార్ అభినందించారు. కృష్ణనగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌డీసీ క్యాంప్‌లో పాల్గొన్న 12 మంది గుంటూరు గ్రూపు కేడెట్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు బహూకరించారు. పీఎం మోదీ ర్యాలీతో పాటు కర్తవ్యపథ్ పరేడ్‌లో పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ సిద్ధు, సుబేదార్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు



పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలేమస్తాన్‌షా ఆవులియా ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దర్గా ధర్మకర్త రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గంధం మహోత్సవం నగర ప్రధాన వీధుల్లో కొనసాగుతూ గురువారం ఉదయం 10 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాబా దర్శనానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు గంధ పంపిణీ, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

హోంగార్డుల చేయూత అభినందనీయం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డుకి సహచర హోంగార్డులు ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 9న ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జి.కనకదుర్గకు హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.32 లక్షల చెక్కుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్‌కృష్ణన్, ఎన్‌సీఓ శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉండగలరని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని, విద్యార్థినులు క్రీడల్లో తప్పనిసరిగా ప్రావీణ్యం సంపాదించాలని ఆయన సూచించారు. పవర్ లిఫ్టింగ్ క్రీడలో పురుషులతో పాటు మహిళలు సైతం పాల్గొని సాధన చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర వీఆర్ జ్యోత్స్నకుమారి, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పరంపర కొనసాగింపు

ఎమ్మెల్యే మద్దాళి గిరి



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్ తదితరులు

నగరంపాలెం: రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల్ని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 20వ డివిజన్ 68వ సచివాలయం పరిధిలోని సంపత్ నగర్ అయ్యప్పస్వామి గుడి నుంచి ఆయన ప్రారంభించారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షత వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికులతో ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నిలిపివేయలేదని, ఇప్పటికీ ఆ పరంపర కొనసాగుతోందని తెలిపారు. వెనుకబడిన వర్గాలపై సీఎంకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు. బీసీలకు ఆయన అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. సీఎం కృషితో సమాజంలో వారిలో మంచి మార్పు వచ్చిందని తెలిపారు. బీసీలకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని మార్చేందుకు సీఎం నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సాధికారత కోసం చేస్తున్న కృషిని అందరూ గుర్తించాలని కోరారు. సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా వెనుకబడిన తరగతుల వారు భవిష్యత్తులో వైద్యులు, న్యాయవాదులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా మారతారని స్పష్టంగా చెప్పవచ్చునని తెలిపారు. ఏపీలో అభివృద్ధి ప్రతిపక్షాలకు కానరావడంలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తీసుకునే కీలక నిర్ణయాలు, అమలుచేసే పథకాలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, డ్రాప్‌వుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల కోసం ఎమ్మెల్యేలు సిఫార్సు చేసే స్థాయికి ఎదిగాయని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన దత్త పుత్రుడు, ఎల్లో మీడియాకు ఇవేమి కనిపించడంలేదని ధ్వజమెత్తారు. పార్లమెంటు వేదికగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్‌కు ఎవరు సరిరారని, ప్రజల్లో ఆయనపై పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రహదారులు, కాల్వలు, తాగునీరు వంటి సమస్యల్ని అక్కడక్కడే పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అత్యవసర పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వై.ఎస్. జగన్ పాలనలో ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉంటున్నారని చెప్పారు. అర్హత ఉండి ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దూరం కారాదనే ఆలోచనతో గడప గడపకు కార్యక్రమంతో ప్రతి ఒక్కరి యోగక్షేమాలు తెలుసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, డివిజన్ అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, కంతేటి శ్యాం, రాష్ట్ర బత్రాజు సంఘం డైరెక్టర్ కూరపాటి రామరాజు, నాయకులు టెంట్‌హౌస్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, చెంబేటి బాబు, శివ, పార్థసారథి, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

కన్నీళ్ల నుంచి కదిలి వచ్చేది కవిత్వం



కవులను సత్కరిస్తున్న కృపాచారి, రావి రంగారావు తదితరులు

పాత గుంటూరు: కన్నీళ్ల నుంచే కవిత్వం కదిలి వస్తుందని ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి తెలిపారు. రావి రంగారావు సాహిత్య పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ రావి రంగారావు ఆధ్వర్యంలో గురువారం బృందావన్ గార్డెన్స్ దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై 'జన రంజక కవి' ప్రతిభా పురస్కారాల ప్రదాన సభ నిర్వహించారు. సభకు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కృపాచారి పాల్గొని ప్రసంగించారు. శ్రామిక జనజీవన స్థితిగతుల్ని వర్ణిస్తూ వారి అభ్యుదయాన్ని కోరుకోవడమే నిజమైన కవి బాధ్యత అని కవులకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా 'అరిసేతిలో బువ్వ పువ్వు' గ్రంథం రాసిన చింతా అప్పలనాయుడు (మన్యం జిల్లా), 'కల్లంచుల బువ్వ' రాసిన ఈ. రాఘవేంద్ర (అనంతపురం), 'ఎగురుతున్న పద్యం' రాసిన అవ్వారు శ్రీధర్ బాబు (నెల్లూరు), 'చినుకు తాకిన నేల' రాసిన శాంతి కృష్ణ (హైదరాబాదు), 'సమీకరణం' రాసిన డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు (గుంటూరు), 'మువ్వ' పద్య కవితలు రాసిన బులుసు వెంకటేశ్వర్లు (విశాఖపట్నం)కు జన రంజక కవి ప్రతిభా పురస్కారాల్ని ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్త కంచర్ల విజయ భాస్కర్, కన్వీనర్ నర్రా ప్రభావతి, సమన్వయకర్తలు పింగళి భాగ్యలక్ష్మి, మన్నం వెంకట గురువు, శివప్రసాద్, డాక్టర్ రావి రమణ, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, గొల్లపూడి గిరిభూషణరావు పాల్గొన్నారు.

12న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో కళాసాధ ఆధ్వర్యంలో ఈనెల 12న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బి.వేదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేదనాదం పుస్తకావిష్కరణ అనంతరం సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలతో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పసుమర్తి కాలనీలో నివసించే నూకల మురళీకృష్ణ సోమవారం కుటుంబంతో ఊరు వెళ్లి, గురువారం వచ్చారు. అయితే, ఇంటి తాళాలు వేసే ఉన్నాయి.లోపలకు వెళ్లి బీరువా పరిశీలించగా కొంత నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ సొత్తు ఎంత అనేది నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు.

వెట్టి చాకిరి నిర్మూలన వారోత్సవాలు ప్రారంభం



న్యాయ విజ్ఞాన బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

నగరంపాలెం: జిల్లా ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 15 వరకు చైల్డ్ లైన్, కార్మిక శాఖ, న్యాయ సేవాధికార సంస్థల సమన్వయంతో వెట్టి చాకిరీ నిర్మూలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు బస్సును ప్రారంభించారు. ప్రతి వ్యక్తీ రాజ్యాంగం కల్పించిన హక్కులకు అర్హుడని, ఎవరికి ఎవర్ని నిర్బంధించి పని చేయించుకునే అధికారం లేదని వక్తలు పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే చట్టపరంగా శిక్షార్హులని తెలిపారు. వెట్టిచాకిరి చేస్తున్న పిల్లల్ని విడిపించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనకు ముందుకు రావాలని అధికార, సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ మానవ అక్రమ రవాణా నివారణ విభాగం అధికారి బెల్లం శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం, చైల్డ్ లైన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం, కార్మిక శాఖ ఇతరత్రా విభాగాల అధికార సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఎం.అల్సన్, శ్రీనివాసబాబు, అధికారులు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ-1 సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట, అరండల్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్ష ఇంజినీర్ ఎం.అల్సన్, నగర ఈఈ శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.విజయకృష్ణ నేతృత్వంలో సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి, 4,692 సర్వీసుల్ని తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నేరుగా చౌర్యానికి పాల్పడుతున్న 139 మందికి రూ. 9.65 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర కేటగిరిల్లో విద్యుత్ వినియోగిస్తున్న ఐదుగురిపై రూ. 1.10 లక్షలు, అనుమతి లోడుకంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 134 మందికి రూ. 8.55 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత్ విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని తెలిపారు. వినియోగదారులంతా విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సీలు లేకపోయినా, తుప్పు పట్టినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. పని చేయని మీటరు నుంచి విద్యుత్ వాడుతున్నా, ఉండాల్సిన దాని బదులు వేరే మీటరు పెట్టి సీలు లేకుండా ఉంటే చౌర్యంగా నిర్ధారిస్తామని పేర్కొన్నారు. మొదటి తప్పిదానికి కాంపౌండ్ పద్ధతిలో, రెండో తప్పిదానికి అరెస్టు చేస్తామని చెప్పారు. విద్యుత్ చౌర్యంపై సెల్ 9440812361కు వాట్సాప్ సమాచారం కూడా ఇవ్వవచ్చని తెలిపారు. దాడుల్లో విద్యుత్ అధికారులు ఎం.రవి కుమార్, కె.రవికుమార్, ఎం.ముస్తాక్ అహ్మద్, కె.కోటేశ్వరరావు, కె.అంజినీరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో పలువురికి సన్మానం



నెహ్రూనగర్: రెడ్డి జనాభ్యుదయ మండలి(రెడ్డి హాస్టల్) ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించిన వారికి గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వ విద్యాలయాల బోధనేతర సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన యేటిగడ్డ వెంకటప్పారెడ్డి, చిల్లీస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన లేళ్ల పెద అప్పిరెడ్డికి, ఆసియా వేద సంస్కృతి పరిశోధన విశ్వవిద్యాలయం హోసూరు, కర్ణాటక రాష్ట్రం నుంచి గౌరవ డాక్టరేట్లు పొందిన భవనం వెంకటరెడ్డి(సేవ) శ్యామల వెంకటరెడ్డి(కళలు, సాహిత్యం)లను మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో హాస్టల్ గౌరవ అధ్యక్షుడు మోదుగుల పాపిరెడ్డి, అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు వీసీఆర్ రెడ్డి, సెక్రటరీ కంది సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ సూరసాని వెంకటరెడ్డి, మేనేజర్ జంగా సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని కలిగించేందుకు కృషి

చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు శాంతమూర్తి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న శాంతమూర్తి, పక్కన ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించేందుకు కృషి చేస్తున్నట్లు చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి తెలిపారు. అమరావతి రోడ్డులోని సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరిక్ష విజ్ఞానం-రాకెట్ సైన్స్‌పై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఈనెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు అవగాహన సదస్సుల్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆయా సదస్సులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అంతరిక్ష పరిశోధన కేంద్ర ఆవిర్భావం దిశగా పునాది వేసిన విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తల కృషి, రాకెట్ నిర్మాణం, వాటి ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు భూమధ్య రేఖ, భూమ్యాకర్షణ రేఖ ఆవశ్యకత తదితర అంశాల్ని విద్యార్థులకు తెలియజేశారని పేర్కొన్నారు. చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ద్వారా 2007 నుంచి విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అనేక సదస్సులు, వర్క్‌షాప్స్, టాలెంట్ టెస్టులు, క్విజ్ పోటీల్ని నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లోని ఆలోచనాశక్తి, సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు కృషి చేయడంతో పాటు నాసా, రష్యన్ అంతరిక్ష కేంద్రాలతో పాటు షార్‌కు విద్యార్థుల్ని పంపినట్లు వివరించారు. రోజుకు రెండు పాఠశాలల చొప్పున ఆరు రోజుల్లో 12 పాఠశాలల్లోని 4,500 మంది విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. మున్ముందు ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులందరికీ విస్తృతరీతిలో అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీలకు స్పందన



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో మోహన సాయి కృష్ణ, కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూలులో గురువారం జిల్లా స్థాయి స్పెల్‌బీ పోటీల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాయపాటి మోహనసాయికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సరళమైన ఇంగ్ల పదాల నుంచి కఠిన పదాలను నేర్చుకుని భాషను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాష అయిన ఆంగ్లంలో పట్టు సాధించేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. స్పెల్‌బీ పోటీలకు ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సుజాత, జేకేసీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు పి.నాగ సుశీల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లావ్యాప్తంగా 29 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల బృందాలకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అందులో ఆరు జట్లను ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. ఫైనల్స్‌కు చేరిన బృందాల్లో డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, వీవా ది స్కూల్, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, సెయింట్ జోసఫ్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కన్న స్కూల్ జట్లు మూడు రౌండ్లలో పోటీ పడ్డారు. కాగా పోటీల్లో తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, వీవా ది స్కూల్, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ జట్లు నగదు బహుమతులు గెలుపొందాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రథినీ చౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రమాదాల నుంచి రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు, సిబ్బంది

గుంటూరు ఈస్ట్: హెల్మెట్ ఉపయోగంపై మణి హోటల్ సెంటర్‌లో గురువారం పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాద సమయంలో ఎక్కువగా తలకు బలమైన గాయాలయ్యే అవకాశం ఉందని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని తెలిపారు. వాహనదారులు తన కుటుంబ సభ్యుల్ని గుర్తు పెట్టుకుని తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నిబంధనల్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, దీని వల్ల ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు.